# ఓట్ల పండుగకు సర్వం సిద్ధం

**ఉదయం 7 నుంచి 5 గంటల వరకు పోలింగ్**

**ఎన్నికల సామగ్రితో తరలివెళ్లిన సిబ్బంది**

**ఖమ్మం నియోజకవర్గంలో 3,22,996 మంది ఓటర్లు**

**355 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు**

ఖమ్మం, నవంబర్ 29: ఖమ్మంలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయాయి. నేడు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుంది. పోలింగ్‌కు గంట ముందు మాక్ పోలింగ్ జరుగుతుంది. ఇప్పటికే ఎన్నికల సిబ్బంది, ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ స్టేషన్లకు తరలివెళ్లారు. వారికి కేటాయించిన ఎన్నికల సామగ్రి, ఈవీఎంలను వెంట తీసుకుని ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ స్టేషన్లకు వెళ్లారు. ఖమ్మంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కేంద్ర పారామిలటరీ దళాలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నాయి. ఖమ్మంలో 355 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఖమ్మం వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నది. ఇప్పటికే మూడు కేంద్ర బలగాలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాయి.

**ఖమ్మంలో 3,22,996 మంది ఓటర్లు**

ఖమ్మం నియోజకవర్గంలో 3 లక్షల 22వేల 996 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1,54,978 మంది పురుషులు, 1,67,969 మంది స్త్రీలు, 49 మంది ఇతరులు ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు 77 మంది, సర్వీస్ ఓటర్లు 76 మంది, 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్నవారు 13,599 మంది ఉన్నారు. వీరిలో ఖమ్మం నగరంలో 2,83,174, మంది ఉండగా, రఘునాథ పాలెంలో 39,822 మంది ఓటర్లు ఉన్నారు.

**దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక ఏర్పాట్లు**

ఖమ్మం నియోజకవర్గంలో మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్‌ను ఖమ్మంలో ఏర్పాటు చేశారు. నగరంలోని 239 పోలింగ్ స్టేషన్ మోమినాన్ హైస్కూల్‌లోని నూతన బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. రాజేంద్ర నగర్ ప్రభుత్వ పాఠశాలలోని 317 పోలింగ్ స్టేషన్‌ను దివ్యాంగుల కొరకు ఏర్పాటు చేయగా ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలోని 146 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ స్టేషన్‌గా ఏర్పాటు చేశారు. యువజనులకు లోని 156 పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దివ్యాంగులను పోలింగ్ స్టేషన్‌కు తీసుకువచ్చేందుకు అధికారులు ఉచిత వాహనాలను సిద్ధం చేశారు.

**ఏదైనా ఓ కార్డు ఉంటే చాలు**

బూత్ లెవల్ అధికారులు ఇచ్చిన ఫొటో స్లిప్‌ను తీసుకుని వెళ్లి నేరుగా ఓటు వేయవచ్చు. ఓటరు ఫొటోస్లిప్ అందని ఓటర్లు ఆధార్, పోస్టాఫీస్, బ్యాంక్ పాస్‌పుస్తకం, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు పాస్‌పోర్ట్, పెన్షన్ డాక్యుమెంట్స్, పాన్‌కార్డు ఏదేని ఆధారంతో తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

# అభివృద్ధి చేశాను.. ఆశీర్వదించండి

**అభివృద్ధి ఇంటి ముందు.. అజయ్ మీ కళ్ల ముందు ఉన్నాడు**

**మీకు అందుబాటులో ఉన్న వ్యక్తిని ఎన్నుకోండి**

**పువ్వాడ అజయ్‌కుమార్**



ఖమ్మం, నవంబర్ 29: ఖమ్మంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాను.. ఆశీర్వదించి ఎన్నికల్లో నాకు ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఎన్నికలు రావడం సహజమని, నేను ఈ ఎన్నికల్లో నా ప్రచారం మొత్తం నేను చేసిన అభివృద్ధి నాతో ప్రజలకు ప్రజలలో నాకు ఉన్న అనుబంధం మీకు తెలుసునని పేర్కొన్నారు. నేను ప్రజలకు కరోనా కష్టకాలంలో కావచ్చు, వరదల సమయంలో కావచ్చు ప్రజలు ఇబ్బందులలో ఉన్నప్పుడు చావుకు తెగించి, కుటుంబ సభ్యులు వారించినా వినకుండా, నాకు కుటుంబం పదవుల కంటే ఖమ్మం ప్రజలే ముఖ్యమని పని చేసిన విషయం మీకు తెలుసునని అన్నారు. నేను ఈ పది సంవత్సరాల్లో ఎక్కువ సమయం గడిపింది ఖమ్మం ప్రజలతోనేనని, నా కుటుంబం అయిన ఖమ్మం ప్రజలతో ఎంత మమేకమైపోయిందో మీ అందరూ గుర్తించాలన్నారు. ప్రతిరోజు మా ఇంటికి వందలాది మంది వివిధ పనుల నిమిత్తం వస్తూ ఉంటారు, వచ్చిన ప్రతి ఒక్కరికీ పనులు చేసి పెట్టిన, కేసీఆర్ నాకు కల్పించిన పదవిని ప్రజల కోసం ఉపయోగించినానని, పనులు చేసుకున్న వారికి పక్కన ఉన్నవారికి అందరికీ తెలిసిన విషయమేనని తెలిపారు. ఎంతోమంది పేద ప్రజలకు ఉచిత వైద్యం మా మమతా సంస్థల ద్వారా అందిస్తున్నాను, చిన్న పాన్ డబ్బా ప్రారంభించాలని నన్ను పిలిచినా నేను మంత్రిని అనే అహంకారం లేకుండా వెళ్లి అది ప్రారంభించి వాళ్లకు ఆశీస్సులు అందించి వచ్చాను. ఏ ఇంట్లో చిన్న ఫంక్షన్ అయినా అన్నా నువ్వు రావాలి అని ఆహ్వానిస్తే తప్పకుండా వెళ్లి ఆతిథ్యం స్వీకరించి ఆ కుటుంబంతో మమేకమైన మనస్తత్వం నాది అన్నారు.. నేను ఇక్కడ పుట్టి పెరిగి. ఇక్కడ చదువుకున్నవాడిగా ఖమ్మం అభివృద్ధి గుమ్మంగా మార్చాలని కలలు కన్నానని, ఆ కలలు సహకారం చేసుకునే విధంగా కష్టపడి పనిచేశానే తప్ప నేను ఎటువంటి స్వార్థ ప్రయోజనాల కోసం నా పదవిని, నా పలుకుబడిని కానీ వాడలేదని, కానీ మిత్రులారా ఎన్నికల ప్రచారంలో తుమ్మల నాగేశ్వరరావు లాంటి పెద్దమనిషి నా ప్రత్యర్థిగా ఉన్నాడు. ఏ మాత్రం ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ నన్ను తీవ్రమైన మనోవేదనకు గురి చేసే ప్రయత్నం చేశారు. నేను మొదటి నుంచి చెప్తూనే వస్తున్నా ధర్మబద్ధంగా యుద్ధం చేద్దాం.. ప్రజల ఆశీర్వాదం ఎవరికి ఉంటే వాళ్ళం గెలుస్తాం. కానీ ఆ పెద్దమనిషి మొదటి నుంచి నాపై అధర్మ యుద్ధమే చేస్తున్నాడు. నన్ను ఒక్కడిని ఓడించడం కోసం అనేక దుష్ట శక్తులను వాడుతున్నాడు. ఎటు పోయిన ప్రజల యొక్క మద్దతు లేని కారణంగా నన్ను దూషించడం, వ్యక్తిగత ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నాడు.. నా మీద అనేక కుట్రలకు తెగబడ్డారు నా నామినేషన్‌ను తిరస్కరించాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. యువకులు, విద్యార్థుల ఓట్లు తనకు పడవనే కక్షపూరిత వైఖరితో ఆ ఓట్లను తొలగించాలంటూ విద్యార్థులకు యువకులకు వ్యతిరేకంగా కుట్రలు పన్నారు. ఈ రోజు ప్రచారంలో జరుగుతున్న అత్యంత దురదృష్టకరమైన ఘటనలు చూస్తున్నామని అన్నారు.. నా పేరుతో ఉన్న మరొక స్వతంత్ర అభ్యర్థిని పోటీ చేయించి నా గొంతుతో వాయిస్ కాల్స్ పెట్టించి ప్రజలలో గుర్తు కన్ఫ్యూజ్ అయ్యేలా ప్రయత్నం చేశారన్నారు. దుర్మార్గపు అధర్మంపై నేను ధర్మంగానే పోరాడుతాను. నేను ప్రజలను మాత్రమే నమ్ముకున్నా.. వారి ఆశీస్సులే నన్ను గెలిపిస్తాయని, విజ్ఞులైన ఖమ్మం ప్రజల ఆలోచించాలని, ఈ దుర్మార్గాలను కుట్రలు కుతంత్రాలకు వ్యతిరేకంగా ఓటు వేసి మీరు ఆశీర్వదిస్తారని నేను ఆశిస్తున్నానని పువ్వాడ అజయ్ ప్రజలను కోరారు.

# భారీ భద్రతతో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**జిల్లా 144 సెక్షన్ అమలు చేస్తున్నాం**

**సమస్యాత్మక కేంద్రాల వద్ద బందోబస్తు**

**పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్**

మామిళ్లగూడెం, నవంబర్ 29: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ తెలిపారు. బుధవారం ఓటింగ్‌కు అవసరమయ్యే సామగ్రి పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సెయింట్ జోసెఫ్ స్కూల్, ఖమ్మం రూరల్ మండలం శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కాలేజ్‌లో సిద్ధంగా ఉన్న జిల్లా పోలీస్ యంత్రాంగంతో పాటు మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలతో పోలీస్ కమిషనర్ మాట్లాడారు. ఎన్నికల్లో పోలీసుల విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. పౌరుల స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రలోభాలకు తావు లేకుండా ఓటరు పోలింగ్‌కు కదిలేలా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి తగిన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా 390 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించినట్లు తెలిపారు. ఈవీఎంల భద్రత, ఓట్ల లెక్కింపు రోజున కట్టుదిట్టమైన భద్రత కల్పించేలా పోలీస్ కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బందికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పని చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్లు తమ ఓటు వేసిన తర్వాత పోలింగ్ బూత్, పోలింగ్ స్టేషన్ చుట్టూ తిరగకుండా చూసుకోవాలన్నారు. ఓటింగ్ చివరి గంటలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్ యొక్క100 మీటర్ల వ్యాసార్థంలో గుమిగూడడం, వాహనాలు నిలపడం వంటి లేకుండా చూడాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు మీ పరిధిలోని మొబైల్ పార్టీకి లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం తెలియజేయాలన్నారు. ఓటర్లను క్యూలైన్లో నిలబెట్టాలని, అగ్గిపెట్టెలు, యాసిడ్, సెల్ ఫోన్లు, ఇంక్ పెన్నులు, నీళ్ల సీసాలు, మారణాయుధాలు, తుపాకీలు మొదలైన నిషేధిత పదార్థాలతో ఎవరినీ స్టేషన్‌లోకి అనుమతించవద్దన్నారు. ప్రిసైడింగ్ అధికారి ప్రత్యేకంగా అభ్యర్థించకపోతే ఏ పోలీసు అధికారి పోలింగ్ బూత్‌కి ప్రవేశించకూడదన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో గుంపులుగా ఉండకుండా చూడాలన్నారు.



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరగాలి : కలెక్టర్

మామిళ్లగూడెం, నవంబర్ 29: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, స్థానిక సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఖమ్మం నియోజకవర్గ, ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పాలేరు నియోజకవర్గ, వైరా సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన వైరా నియోజకవర్గ, మధిర పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మధిర నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్‌తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలని తెలిపారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1456 పోలింగ్ కేంద్రాల్లో 12లక్షలకు పైగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తప్పనిసరిగా నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీటి, టాయిలెట్ ఇతర వసతులు కల్పించామని అన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. ఎన్నికలలో ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616